సాక్షి
కర్నూలు
శనివారం । 20 । ఏప్రిల్ । 2024



భ్రామరీకి ఊయల సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా దేవికి దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఉంచి సహస్రనామ పూజలు జరిపించారు.



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి శుక్రవారం కడపకు చెందిన మహేష్ బాబు రూ.1,11,116 విరాళాన్ని ఆలయ పర్యవేక్షకులు నాగరాజుకు అందజేశారు.



వాన కురిసింది

మండు వేసవిలో వరుణుడు కొంత ఉపశమనం కలిగించాడు. నంద్యాల జిల్లాలో పలు ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. 8లో▸

న్యూస్‌రీల్

జిల్లాకు ట్రైనీ కలెక్టర్ కేటాయింపు



కలెక్టర్ డాక్టర్ జి.సృజనకు బొకేను అందజేస్తున్న చల్లా కల్యాణి

కర్నూలు(సెంట్రల్): జిల్లాకు ట్రైనీ కలెక్టర్‌ను కేటాయించారు. కొత్తగా కలెక్టర్‌గా ఎంపికైన చల్లా కల్యాణిని జిల్లాకు కేటాయించడంతో ఆమె శుక్రవారం కర్నూలు వచ్చారు. కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జేసీ నారపురెడ్డి మౌర్యలను మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకేలను అందజేశారు. శిక్షణకు అన్ని రకాలుగా సహకరించాలని ఆమె వారిని కోరారు.

నేడు 'ఏకలవ్య' పరీక్ష

కర్నూలు(అర్బన్): రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఉన్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో 6వ తరగతి ప్రవేశాలకు సంబంధించిన ప్రవేశ పరీక్ష బీ క్యాంప్‌లోని ఏపీ గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో శనివారం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఏ లక్ష్మిగురప్ప తెలిపారు. జిల్లాకు చెందిన విద్యార్థులకు సౌలభ్యంగా ఉంటుందని ఇక్కడ పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా పాఠశాలల్లో 7, 8, 9 తరగతుల్లో మిగిలిపోయిన సీట్లను భర్తీ చేసేందుకు కూడా ప్రవేశ పరీక్షను నిర్వహిస్తున్నారన్నారు. మిగిలిన సీట్లలో ప్రవేశం పొందేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తమ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకొని ప్రవేశ పరీక్షకు హాజరు కావాలన్నారు. ప్రవేశ పరీక్ష ఉదయం 11.30 గంటల నుంచి 1.30 గంటల వరకు జరుగుతుందని, ఎండలు అధికంగా ఉన్నందున పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఉదయం 10 గంటలకంతా పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

నంద్యాల జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు

కర్నూలు(అగ్రికల్చర్): నంద్యాల జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. శుక్రవారం డోన్, బనగానపల్లె మండలాల్లో 45.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. గోస్పాడులో 45, ఆత్మకూరులో 44.2, ఆళ్లగడ్డలో44.2, బండిఆత్మకూరులో 44.2, సంజామలలో 44.1 డిగ్రీల ప్రకారం ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కర్నూలు జిల్లాలో ఉష్ణోగ్రతల తీవ్రత కాస్త తగ్గింది. కర్నూలులో 42.5, మంత్రాలయంలో 42.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. వెల్దుర్తి, సి.బెళగల్, గూడూరు, కల్లూరు, కోడుమూరు, కోసిగి, కౌతాళం, కర్నూలు మండలాల్లో 41 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కాగా.. ఉమ్మడి జిల్లాలో రెండు, మూడు ప్రాంతాల్లో చిరుజల్లులు కురిశాయి.

హోమ్ ఓటింగ్ దరఖాస్తుకు 22 వరకు గడువు

కోవెలకుంట్ల: 85 సంవత్సరాలు వయస్సు పైబడిన వృద్ధులు, అంగవైకల్యం కలిగిన వ్యక్తులు 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఇంటి వద్ద నుంచే ఓటు వేసేందుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది. ఇందుకోసం ఆయా కేటగిరిలకు చెందిన ఓటర్లు ఫారం–12డీని సమర్పించాల్సి ఉంది. పూర్తి వివరాలతో నింపిన ఫారాన్ని ఈ నెల 22వ తేదీలోపు రిటర్నింగ్ అధికారులకు అందజేయాలని ఎన్నికల అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

కామేశ్వరీదేవికి వెండి కాసుల హారం

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీదేవి అమ్మవారికి మహానందికి చెందిన రిటైర్డ్ వీఆర్‌ఓ సత్యనారాయణ దంపతులు శుక్రవారం వెండి కాసుల హారం అందించారు. ఈ మేరకు వారు కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని ముందుగా పూజలు నిర్వహించారు. అనంతరం డొనేషన్ కౌంటర్ వద్దకు చేరుకుని ఏఈఓ యరమల మధు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శశిధర్‌రెడ్డికి హారం అందించారు. 59 గ్రాముల బరువు ఉందని, వెండి కాసుల హారానికి బంగారు పూత వేయించినట్లు దాతలు చెప్పారు.



ఏఈఓ మధుకు వెండి హారం అందిస్తున్న సత్యనారాయణ దంపతులు

నామినేషన్ల కోలాహలం

- రెండో రోజు 20 మంది అభ్యర్థులు 21 సెట్ల నామినేషన్ల దాఖలు
- వైఎస్సార్‌సీపీ అభ్యర్థులుగా నామినేషన్లు వేసిన కంగాటి శ్రీదేవి, ఆదిమూలపు సతీష్, బి. విరూపాక్షి
- ఎమ్మిగనూరులో టీడీపీకి షాక్.. బీజేపీ అభ్యర్థి మురహరిరెడ్డి నామినేషన్



కంగాటి శ్రీదేవి నామినేషన్ కార్యక్రమానికి పత్తికొండలో భారీగా తరలివచ్చిన ప్రజలు

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో రెండో రోజు శుక్రవారం నామినేషన్ల పర్వం ఊపందుకుంది. మొత్తం 20 మంది అభ్యర్థులు 21 సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. కర్నూలు పార్లమెంట్‌తో పాటు కర్నూలు, పాణ్యం, కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, ఆలూరు, పత్తికొండ అసెంబ్లీ నియోజకవర్గాలకు రెండోరోజు ఎన్నికల సంఘం అధికారులు నామినేషన్లను స్వీకరించారు. కర్నూలు పార్లమెంట్ స్థానం నుంచి ఎస్‌యూసీఐ(సీ) పార్టీ నుంచి మల్లెపాగు నాగన్న నామినేషన్‌ను దాఖలు చేశారు. కర్నూలు నియోజకవర్గం నుంచి ఆరుగురు నామినేషన్ వేశారు. ఇందులో ఎస్‌యూసీఐ(సీ) నుంచి హరీష్‌కుమార్‌రెడ్డి, బహుజన్ సమాజ్ పార్టీ నుంచి అరుణకుమార్, సోషల్ డెమోక్రటిక్ పార్టీ నుంచి షేక్ ఖలీల్ అహ్మద్, స్వతంత్ర అభ్యర్థులు ఎస్.నజీర్ అహ్మద్, ఎం.శ్రీహర్ష, ఎస్.ఇంతియాజ్‌బాషా ఉన్నారు. పత్తికొండ నియోజకవర్గం నుంచి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరఫున ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి నామినేషన్‌ను వేశారు. అలాగే ఆమె కుమారుడు కంగాటి రామ్మోహన్‌రెడ్డి కూడా నామినేషన్ దాఖలు చేశారు. టీడీపీ నుంచి కేఈ శ్యామ్‌బాబు, సీపీఐ అభ్యర్థి పి.రామచంద్రయ్య ఒక్కో సెట్ నామినేషన్లను దాఖలు చేశారు. పాణ్యం నుంచి టీడీపీ అభ్యర్థి గౌరు చరితారెడ్డి తరఫున ఆమెను బలపరచే పెరుగు పురుషోత్తంరెడ్డి నామినేషన్‌ను ఆర్వో నారపురెడ్డి మౌర్యకు అందజేశారు. ఇండియా ప్రజాబంధు పార్టీ నుంచి మల్లపురాజు అనే వ్యక్తి కూడా ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. కోడమూరు వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థిగా డాక్టర్ ఆదిమూలపు సతీష్ రెండు సెట్ల నామినేషన్ వేశారు. అంతకముందు జరిగిన ర్యాలీలో మాజీ ఎమ్మెల్యేలు కొత్తకోట ప్రకాష్‌రెడ్డి, మణిగాంధీ, పార్టీ నాయకులు కోట్ల హర్షవర్దన్‌రెడ్డి, కోట్ల హరి చక్రపాణిరెడ్డి పాల్గొన్నారు. కోడుమూరు కాంగ్రెస్ అభ్యర్థి పరిగెల మురళీకృష్ణ తరఫున ప్రతిపాదిత అభ్యర్థి నామినేషన్ వేశారు. మంత్రాలయం నియోజకవర్గానికి గుడిసె పెద్దరామాంజనేయులు, సి.పరమేష్ స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లను దాఖలు చేశారు. ఆదోని నుంచి బీజేపీ నాయకుడు పీవీ పార్థసారథి నామినేషన్ వేశారు. ఆలూరు వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థిగా బి.విరుపాక్షి తాత్కాలికంగా ఒక్క సెట్ నామినేషన్ వేశారు. ఈయన ఈనెల 23వ తేదీన పెద్ద ఎత్తున నామినేషన్‌ను దాఖలు చేసేందుకు సమయం తీసుకున్నారు.



పత్తికొండ ఆర్డీఓ కార్యాలయంలో ఆర్వో నీలపు రామలక్ష్మికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కంగాటి శ్రీదేవి, చిత్రంలో కర్నూలు ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య తదితరులు



రిటర్నింగ్ అధికారి శేషిరెడ్డికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్, చిత్రంలో కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు



ఆదిమూలపు సతీష్ నామినేషన్ కార్యక్రమానికి హాజరైన అభిమానులు

ఆశీర్వదించండి.. అండగా ఉంటా

కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు, ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బీవై రామయ్యకు ఎన్నికల్లో ఓటు వేసి ఆశీర్వదించాలని ఆదిమూలపు సతీష్ విజ్ఞప్తి చేశారు. నామినేషన్ దాఖలు అనంతరం ఆయన మాట్లాడారు. జగనన్న తనపై ఎంతో నమ్మకం ఉంచి ఎమ్మెల్యే సీటు ఇచ్చారన్నారు. అందరి సహకారంతో ఎన్నికల్లో విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఒక డాక్టర్‌గా నియోజకవర్గ ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉంటానన్నారు. నియోజకవర్గంలో వరుసగా మూడోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తామని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకుంటామన్నారు. జెడ్పీటీసీలు రఘునాథ్ రెడ్డి, మౌలాలి, ప్రసన్నకుమార్, ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

భర్త సమాధిపై నామినేషన్ పత్రాలు ఉంచి..



భర్త సమాధిపై నామినేషన్ పత్రాలు ఉంచి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

వెల్దుర్తి(కృష్ణగిరి): 'ఎమ్మెల్యేగా పత్తికొండ ప్రజలకు సేవ చేయాలన్న మీ ఆశయ సాధన కోసం నడుం బిగించిన నన్ను మరోసారి ఆశీర్వదించండి' అని కోరుతూ పత్తికొండ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి తన నామినేషన్ పత్రాలను భర్త, దివంగత వైఎస్సార్‌సీపీ నేత చెరుకులపాడు నారాయణరెడ్డి సమాధిపై ఉంచి భావోద్వేగానికి లోనయ్యారు. శుక్రవారం ఉదయం ఆమె పత్తికొండలో నామినేషన్ సమర్పించేందుకు ముందుగా తన కుటుంబ సభ్యులతో కలిసి స్వగ్రామం చెరుకులపాడులో తన భర్తకు, ఆయనతో పాటు హత్యకు గురైన సాంబశివుడి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. నారాయణరెడ్డి, ఆయన తండ్రి శివారెడ్డి సమాధులపై నామినేషన్ పత్రాలుంచి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. చెరుకులపాడు నారాయణరెడ్డి 2017 మే 21న హత్యకు గురికాగా.. అంత్యక్రియలకు హాజరైన పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆనాడు నారాయణరెడ్డి కుటుంబీకులకే టికెట్ ఇస్తానని హామీ ఇచ్చి.. కంగాటి శ్రీదేవి అభ్యర్థిగా ప్రకటించారు. 2019 మార్చి 22న ఆమె తన భర్త ఘాట్‌పై నామినేషన్ పత్రాలు ఉంచి ఆశీర్వాదం తీసుకుని ఎన్నికలో గెలుపొందారు. మరోసారి తన భర్త నారాయణరెడ్డి సమాధిపై నామినేషన్ పత్రాలను ఉంచి ఆశీర్వాదం తీసుకున్నారు. వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి చెరుకులపాడు ప్రదీప్‌రెడ్డి, కృష్ణగిరి ఎంపీపీ కంగాటి వెంకట్రామిరెడ్డి, కుమారులు కంగాటి రామ్మోహన్ రెడ్డి, వెల్దుర్తి సొసైటీ చైర్మన్ కంగాటి వంశీధర్ రెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘించిన బీజేపీ అభ్యర్థి

ఆదోని అర్బన్: బీజేపీ అభ్యర్థి పార్థసారథి ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించారు. అభ్యర్థితో పాటు నలుగురే ఆర్వో చాంబర్‌లోకి వెళ్లాల్సి ఉంది. అంతేగాకుండా బారికేడ్ల నుంచి కూడా వంద మీటర్ల లోపు నలుగురే రావాలి. డీయస్పీ శివనారాయణ స్వామి అడ్డుకున్నా అభ్యర్థితో పాటు ఎనిమిది మంది ఆర్వో కార్యాలయంలోకి వచ్చారు. అభ్యర్థితో పాటు నలుగురు వస్తేనే నామినేషన్ స్వీకరిస్తానని ఆర్వో శివనారాయణశర్మ చెప్పడంతో మిగతా వారు బయటికి వెళ్లారు.



బారికేడ్లను దాటి బీజేపీ అభ్యర్థితో పాటు 8 మంది నామినేషన్ వేసేందుకు వెళ్తున్న దృశ్యం

టీడీపీకి షాక్ ఇచ్చిన బీజేపీ

ఎమ్మిగనూరులో టీడీపీకి షాక్ తగిలింది. ఇప్పటికే ఎమ్మిగనూరు స్థానాన్ని టీడీపీకి కేటాయించడంతో బీవీ జయనాగేశ్వరరెడ్డి నామినేషన్ వేశారు. అయితే శుక్రవారం అదే స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా మురహరిరెడ్డి నామినేషన్ దాఖలు చేయడంతో కథ అడ్డం తిరిగింది. ఆయనకు బీజేపీ నాయకులతోపాటు కామర్తి శివ ఆధ్వర్యంలోని జనసేన నాయకులు మద్దతు తెలిపారు. కాగా.. బీజేపీ అభ్యర్థి మురహరిరెడ్డి మాత్రం కచ్చితంగా బరిలో ఉంటానని చెబుతున్నారు.

పాతికేళ్లుగా టీడీపీకి అందని విజయం

- తెలుగుదేశం పార్టీని నమ్మని ఆలూరు వాసులు



ఆలూరు రూరల్: ఎన్నికల సంగ్రామంలో పాతికేళ్లుగా ఆలూరు వాసులు టీడీపీని దూరం పెడుతూ వస్తున్నారు. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబును నమ్మం అంటూ భీష్మించుకు కూర్చోవడంతో ఆ పార్టీ శ్రేణుల్లో నైరాశ్యం అలముకుంది. దీనికి తోడు ఆ పార్టీ నియోజకవర్గ స్థాయి నాయకులందరూ వైఎస్సార్‌సీపీ కండువా కప్పుకోవడంతో అభ్యర్థి విరూపాక్షి గెలుపుపై ధీమా ఏర్పాడింది. సార్వత్రిక ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల కావడంతో ఆలూరు అసెంబ్లీ నియోజకవర్గానికి 15వ సారి శాసన సభ ఎన్నికల జరుగుతున్నాయి. ఆలూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 2014, 2019 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయఢంకా మోగించింది. 2024లో సైతం హ్యాట్రిక్ విజయం దిశగా దూసుకుపోతోంది. ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి విరూపాక్షి ప్రచారం జోరందుకుంది. ఏ గ్రామానికి వెళ్లినా జనం బ్రహ్మరథం పడుతున్నారు. తమ ఓటు ఫ్యాన్ గుర్తుకే అంటున్నారు. ఇదిలా ఉండగా ఆలూరులో తెలుగుదేశం పార్టీ పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంది. ఆ పార్టీ నుంచి నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులంతా వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వీరభద్రగౌడ్ ఏకాకిగా మిగిలిపోయి దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. 1983లో టీడీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీ కేవలం మూడు సార్లు మాత్రమే ఇక్కడ విజయం సాధించింది. 1994లో మసాల ఈరన్న గెలుపు చివరిది కాగా గత 25 ఏళ్లుగా ఆలూరు నియోజకవర్గ ప్రజలు టీడీపీకి ఓట్లు వేసేందుకు మొగ్గు చూపడం లేదు.

చంద్రబాబు ఫ్లాప్‌షో!

ఆలూరు: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు శుక్రవారం ఆలూరులో నిర్వహించిన ప్రజాగళం సభకు జన స్పందన కరువైంది. రోడ్‌షోలో ప్రజలు కనిపించలేదు. జనం లేకపోవడంతో ఎలా ప్రసంగించాలని చంద్రబాబు తర్జనభర్జన పడ్డారు. సభకు కొద్ది మంది హాజరు కాగా.. ఎక్కువగా పార్టీ జెండాలే కనిపించాయి. దీంతో చంద్రబాబు అసహనం వ్యక్తం చేస్తూ జెండాలను దించండి అన్నా ఎవరూ పట్టించు కోలేదు. సభలో బీజేపీ నాయకుల పేర్లు ప్రస్తావించకపోవడం, వారిని ప్రచార రథంపైకి ఆహ్వానించకపోవడంతో ఆ పార్టీ నేతలు అలకబూనారు. సభలో జనసేన నాయకులు కనిపించలేదు.. కార్యకర్తలు అక్కడక్కడ జెండాలతో కనిపించారు. తమకు జన బలం లేదని టీడీపీ ఆలూరు నియోజకవర్గం అభ్యర్థి వీరభద్రగౌడ్ అవమానించారని బీజేపీ నాయకులు విలేకరుల సమావేశంలో ఆరోపించారు. ఇదిలా ఉండగా.. హెలిపాడ్ వద్ద ఆదోని మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు, టీడీపీ నేత బీటీ నాయుడు మధ్య మాటల యుద్ధం జరిగింది. తనకు టిక్కెట్ ఇవ్వకపోవడానికి బీటీ నాయుడే కారణమని మీనాక్షినాయుడు అనడంతో ఒకరిపై ఒకరు మాటలు రువ్వుకున్నారు. అక్కడ ఉన్న టీడీపీ నాయకులు ఇద్దరికి సర్ది చెప్పారు. ఈ విషయాన్ని కొందరు టీడీపీ నాయకులు అధినేత చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లారు. వీరిద్దరినీ చంద్రబాబు హెచ్చరించినట్లు సమాచారం.



జెండాలు దించాలని సూచిస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు

ఎన్నికల వ్యయం పక్కాగా లెక్కింపు

కర్నూలు(సెంట్రల్): పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల వ్యయాలను కచ్చితంగా లెక్కించేందుకు అన్ని రకాలుగా సహకరిస్తామని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ డాక్టర్ జి.సృజన వ్యయ పరిశీలకులకు హామీ ఇచ్చారు. శుక్రవారం కలెక్టర్‌ను ఆమె చాంబరులో కర్నూలు పార్లమెంట్ ఎన్నికల వ్యయ పరిశీలకుడు ఆర్ఆర్ ఎన్ శుక్లా, కర్నూలు, పాణ్యం, పత్తికొండ, కోడుమూరు అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల వ్యయ పరిశీలకులు అరిందం ముఖోపాధ్యాయ, ఎమ్మిగనూరు,మంత్రాలయం, ఆదోని, ఆలూరు అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల వ్యయ పరిశీలకుడు రాకేష్ భదాదియ కలిశారు. జిల్లాలో అభ్యర్థుల వ్యయాలపై వారు కాసేపు చర్చించుకున్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేసేందుకు వ్యయాలపై దృష్టి సారించినట్లు వారు కలెక్టర్‌కు వివరించారు. అలాగే నంద్యాల పార్లమెంట్ వ్యయ పరిశీలకుడు ఎస్. మణికందన్ పాణ్యం అసెంబ్లీ ఆర్ఓ జేసీ నారపురెడ్డి మౌర్యను మర్యాదపూర్వకంగా కలిశారు.



వ్యయ పరిశీలకులతో సమావేశమైన కలెక్టర్ డాక్టర్ జి.సృజన

25న గురుకుల ప్రవేశ పరీక్ష

నంద్యాల(న్యూటౌన్): ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలల్లో 2024–25 విద్యాసంవత్సరం ప్రవేశానికి ఈనెల 25వ తేదీన పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయ సంస్థ కార్యదర్శి నరసింహరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5, 6, 7, 8 తరగతులకు ఏపీఆర్ఎస్ Cat–2024 ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు, కళాశాలలకు ఏపీఆర్‌జేసీ, డీసీసెట్ – 2024 మధ్యాహ్నం 2.30గంటల నుండి 5గంటల వరకు అన్ని జిల్లా కేంద్రాల్లో నిర్వహించడం జరుగుతుందన్నారు. పరీక్షకు సంబంధించిన అభ్యర్థులు హాల్‌టికెట్లను https://aprs.apcfss.in వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. అభ్యర్థులు ఐడీతో పాటు పుట్టిన తేదీ ద్వారా హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. పరీక్ష కేంద్రానికి గంట ముందే చేరుకోవాలన్నారు.

శాస్త్రోక్తంగా చౌడేశ్వరిదేవి పల్లకీ సేవ

బనగానపల్లె: నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారికి శుక్రవారం శాస్త్రోక్తంగా పల్లకీ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయ అసిస్టెంటెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో కుంకుమార్చన అభిషేకం తదితర పూజలు జరిగాయి. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని అందంగా ముస్తాబు చేసి పల్లకీలో ఉంచి పూజలు నిర్వహించారు. అనంతరం సంప్రదాయబద్ధంగా పల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, గ్రామస్తులు భక్తులు పాల్గొన్నారు.



గౌరుపై కేసులు లేవంట!

- అఫిడవిట్ సమర్పించిన టీడీపీ అభ్యర్థి గౌరు చరిత

కర్నూలు(సెంట్రల్): నామినేషన్ వేసే సందర్భంలో తనపై, తన భర్త గౌరు వెంకటరెడ్డిపై ఎక్కడా కేసులు లేవని టీడీపీ పాణ్యం నియోజకవర్గ అభ్యర్థి గౌరు చరితారెడ్డి అఫిడవిట్ సమర్పించారు. తన పేరిట రూ.3.08 కోట్లు, తన భర్త పేరిట రూ.5.03 కోట్ల స్థిరాస్తులు ఉన్నాయని చూపించారు. తనకు రూ.24 లక్షల విలువ చేసే రెండు కార్లు, తన భర్తకు రూ.5 లక్షల విలువ చేసే మహేంద్ర ట్రాక్టర్ ఉందని ఆమె అందులో పేర్కొన్నారు. రూ. 74 లక్షల విలువ చేసే 1,100 గ్రాముల బంగారం ఉందని.. తన పేరిట రూ.14,85,000, భర్త పేరిట రూ.96,99,000, కుమారుడు పేరిట రూ.67,43,000 చరాస్తులు ఉన్నాయని చూపించారు. తనకు బ్యాంకుల్లో రూ.22,57,500, భర్తకు రూ.7,77,000 అప్పులు ఉన్నాయని అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

సమానంగా అప్పులు.. ఆస్తులు

కోడుమూరు(ఎస్సీ) వైఎస్ఆర్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన ఆదిమూలపు సతీష్‌కు ఆస్తులతోపాటు అప్పులు కూడా సమానంగా ఉన్నాయి. తన పేరిట రూ.8.83 కోట్లు, భార్య పేరిట రూ.2.19 కోట్లు, కూతూరు రీతు జాస్మిన్‌పేరిట రూ.19.50 లక్షలు, కుమారుడు రిత్విక్ శ్యామూల్ రూ.13.24 లక్షల చరాస్తులు ఉన్నట్లు చూపారు. కాగా, ఆయనకు వివిధ బ్యాంకులు, ఇతరా చోట్లా రూ.8.50 కోట్లు, భార్యకు రూ.7.06 లక్షల అప్పులు ఉన్నాయి.

220 గ్రాముల బంగారం

పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవికి 220 గ్రాముల బంగారం మాత్రమే ఉంది. కూతూరుకు 200 గ్రాముల బంగారం ఉంది. ఆమె మొత్తం చరాస్తులు విలువ 83.64 లక్షలు కాగా, ఆమె భర్త లేట్ నారాయణరెడ్డి పేరిట రూ.28 లక్షలు, కూతూరుస్నేహారెడ్డి పేరిట రూ.8.86 లక్షల ఆస్తులు ఉన్నాయి.

స్థిరాస్తులే ఎక్కువ

ఆలూరు వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బి.విరుపాక్షికి చరాస్తుల కంటే స్థిరాస్తులే ఎక్కువగా ఉన్నాయి. ఈయనకు చిప్పగిరిలో 26.04 ఎకరాలు, ఆయన భార్యకు అక్కడే 10.98 ఎకరాల భూమి ఉంది. ఆయనకు రూ.6,66,00,000 స్థిరాస్తులు ఉన్నాయి, ఆయన భార్యకు కూడా 46 లక్షల స్థిరాస్తులు ఉన్నాయి. బ్యాంకుల్లో రూ. 84,18,709 అప్పు ఉన్నట్లు ఆయన అఫిడవిట్‌లో చూపారు.

క్లుప్తంగా

అక్రమంగా ఇనుప ఖనిజం నిల్వ

● కేసు నమోదు



అక్రమంగా నిల్వ ఉంచిన ఇనుప ఖనిజాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా మైనింగ్ విజిలెన్స్ అధికారులు

కర్నూలు (న్యూటౌన్): వెల్దుర్తి మండలం బాలాపురం నుంచి రేపల్లేకు వెళ్లే రోడ్డులో అక్రమంగా ఇనుప ఖనిజాన్ని నిల్వ ఉంచడంతో ఇద్దరి వ్యక్తులపై వెల్దుర్తి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైందని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి రాజశేఖర్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఎంబాయి ఆర్‌ఎఫ్ నుంచి అక్రమంగా ఇనుప ఖనిజాన్ని తీసుకువచ్చి సర్పరాజాపురం లోని సర్వే నంబర్ 501లో అక్రమంగా నిల్వ ఉంచారన్నారు. ఇనుప ఖనిజాన్ని సీజ్ చేశామన్నారు. వెల్దుర్తి, పలమాన్‌పల్లెకు చెందిన ఇద్దరు వ్యక్తులు అక్రమంగా ఇనుప ఖనిజాన్ని తవ్వి నిల్వలు చేసినట్లు విచారణలో తేలిందన్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఎవరైనా అక్రమంగా ఇనుప ఖనిజాన్ని తవ్వి తరలించాలని చూస్తే చట్ట పరంగా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తనిఖీల్లో జిల్లా మైనింగ్ విజిలెన్స్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి, టెక్నికల్ అసిస్టెంట్ దిలీప్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణ చర్యలు పకడ్బందీగా చేపట్టాలి



అగ్నిప్రమాదాల నివారణపై ఆసుపత్రి సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అధికారులు

కర్నూలు: ఆసుపత్రులు, అపార్ట్‌మెంట్లు, విద్యాసంస్థలు, షాపింగ్ మాల్స్, పరిశ్రమల్లో అగ్నిమాపక నివారణ చర్యలు పకడ్బందీగా చేపట్టాలని, పాటించని వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి చిన్నబజారి హెచ్చరించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా 6వ రోజు కర్నూలు శివారులోని జొహరాపురం రోడ్డులో ఉన్న సూర్య హాస్పిటల్, సుంకేసుల రోడ్డులోని కార్తీక హాస్పిటల్‌లో ప్రమాదం సంభవించినప్పుడు మంటలను ఎలా ఆర్పాలనే దానిపై ప్రదర్శన (డెమో) ఇచ్చారు. అగ్నిప్రమాదాల్లో చిక్కుకున్న వారిని బయటకు ఎలా తరలించాలి, గాయపడిన వారికి చికిత్స అందించడంపై నర్సులకు, సెక్యూరిటీ సిబ్బందికి అవగాహన కల్పించారు. వేసవిలో మండే స్వభావం కలిగిన వస్తువులను జాగ్రత్తగా ఉంచడం, మంటలను ఆర్పే యంత్రాలను సిద్ధంగా ఉంచుకోవడంతో పాటు పలు అంశాలపై ఆసుపత్రి నిర్వాహకులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ నెల 14 నుంచి జిల్లా వ్యాప్తంగా ఆ శాఖ అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా అగ్నిప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు విరివిగా కరపత్రాలు పంపిణీ చేశారు.



☛ ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు పేరు జలంధర్. దేవనకొండ మండలం నల్లచెలిమెల గ్రామానికి చెందిన ఈయనకు ఐదు ఎకరాల పొలం ఉంది. హంద్రీ నీవా కాలువ 2013లోనే అందుబాటులోకి వచ్చినా 2018 వరకు సాగు నీరు అందేది కాదు. 2019 నుంచి కాల్వ నీటిని పంటలకు వినియోగించడం ప్రారంభమైంది. దీంతో ఈయన ఏటా మిరప సాగు చేస్తున్నారు. సాధారణంగా బోరుబావుల కింద మాత్రమే మిరప సాగు చేస్తారు. నీరు సమృద్ధిగా ఉండటంతో ఈ ఏడాది 5 ఎకరాల్లో 100 క్వింటాల మిరప దిగుబడి తీశాడు.



☛ ఈ రైతు పేరు హంపయ్య. దేవనకొండకు చెందిన ఈయన ఖరీఫ్, రబీ సీజన్లలో వేరుశనగ, చిక్కుడు, గోరుచిక్కుడు పంటలను సాగు చేశాడు. మూడు ఎకరాల్లో వేరుశనగ, రెండు ఎకరాల్లో చిక్కుడు పంటలు వేశాడు. హంద్రీనీవా నీటితో రెండు పంటలకు పండిస్తున్నానని తెలిపారు. మంచి దిగుబడి వచ్చినట్లు సంతోషం వ్యక్తం చేశారు.

☛ ఈ ఇద్దరు రైతులే కాదు. వేలాది మంది రైతులు హంద్రీనీవా నీటితో ఖరీఫ్, రబీ సీజన్లలో పంటలను సాగు చేసుకుంటున్నారు. హంద్రీ–నీవా ప్రాజెక్టు 2012 నవంబరు నెలలో ప్రారంభమైనప్పటికీ ఆయకట్టుకు సాగు నీరు అందించలేకపోయారు. తెలుగు దేశం పార్టీ 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్నప్పటికీ ఆయకట్టుదారులకు అరకొరగా కూడా నీటిని అందించలేకపోయారు. 2019లో వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ముందస్తు ప్రణాళికతో హంద్రీనీవా కాలువకు నీటిని పంపింగ్ చేసి వరుసగా ఐదేళ్లుగా గతంలో కంటే అత్యధిక నీటిని జిల్లా ఆయకట్టుకు అందించింది. ఫలితంగా రికార్డు స్థాయిలో ఐదేళ్లలో లక్షన్నర ఎకరాలకుపైగా సాగు నీరు అందింది.

కరువు నేలలో జల సిరులు

- హంద్రీ- నీవా ప్రాజెక్టుకు అధిక ప్రాధాన్యత ఇచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- టీడీపీ హయాంలో 9.52 టీఎంసీలు మాత్రమే వాడకం
- ఐదేళ్లలో 42,050 ఎకరాల ఆయకట్టుకు మాత్రమే నీరు
- వైఎస్‌ఆర్‌సీపీ హయాంలో 30.56 టీఎంసీల వినియోగం
- ఐదేళ్లలో లక్షన్నర ఎకరాల ఆయకట్టుకు అందిన సాగు నీరు
- రెండు పంటల సాగుతో ఆనందం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



మల్యాల ఎత్తిపోతల వద్ద కృష్ణానది నీటిని ఎత్తిపోస్తున్న దృశ్యం (ఫైల్)

కర్నూలు సిటీ: రాయలసీమలోని పల్లెలకు తాగునీటిని అందించేందుకు అప్పటి ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు 1996 మార్చి 11న ఉరవకొండ దగ్గర ఒకసారి, 1999 జూలై 9న మరోసారి రాప్తాడు నియోజకవర్గం ఆత్మకూరు దగ్గర హంద్రీ–నీవా ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. ఆయన పాలనా కాలంలో రూ. 190 కోట్ల బడ్జెట్ కేటాయించి, కేవలం రూ. 23.54 కోట్లు మాత్రమే ఖర్చు చేసి వదిలేశారు. 2014లో మళ్లీ అధికారంలోకి వచ్చినా.. హంద్రీ–నీవా గురించి పట్టించుకోలేదు.

ప్రాణం పోసిన వైస్సార్

దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 2004కు ముందు చేపట్టిన పాదయాత్రలో రాయలసీమలోని కరువును చూసి చలించిపోయారు. 2004 ఎన్నికల్లో గెలుపొందిన అనంతరం జలయజ్ఞంలో చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేసి వదిలేసిన హంద్రీ–నీవా ప్రాజెక్టును చేపట్టారు. రూ.6,850 కోట్లతో టెండర్లు పిలిచి తన హయాంలో రూ. 4,340.36 కోట్ల ఖర్చు చేసి ప్రాజెక్టును యుద్ధప్రతిపాదికన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నారు. దాదాపు 90 శాతం పనులు పూర్తి చేయించారు. మహానేత మరణం తరువాత ముఖ్యమంత్రులుగా పనిచేసిన రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డిలు మిగిలిన 10 శాతం పనులు పూర్తి చేసి 2012లో హంద్రీ–నీవా ప్రాజెక్టును జాతికి అంకితం చేశారు. అయితే అంకితం చేసిన మొదటి మూడేళ్ల జిల్లా ఆయకట్టుకు చుక్క నీరు అందలేదు. 2014లో టీడీపీ అధినేత చంద్రబాబు అధికారంలోకి వచ్చినా ఆయకట్టు రైతుల ఆశలు పండలేదు. టీడీపీ హయాంలో మూడేళ్ల కేవలం 9.52 టీఎంసీల నీరు మాత్రమే ఆయకట్టుకు అందింది.

హంద్రీనీవా పరిధిలోని ఆయకట్టు విస్తీర్ణం, నీటి వినియోగం సంవత్సరాల వారీగా...

సంవత్సరం	పంపింగ్ చేసిన రోజులు	మల్యాల నుంచి లిఫ్ట్ చేసిన నీరు(టీఎంసీలు)	జిల్లాకు వినియోగించిన నీరు(టీఎంసీలు)	సాగైనఆయకట్టు ఎకరాల్లో
2014-15	196	16.85	0	0
2015-16	69	7.79	1	6,200
2016-17	197	32.07	2.7	8,500
2017-18	200	28.70	2.82	13,500
2018-19	262	36.90	5	13,850
2019-20	270	40.01	7.46	31,000
2020-21	260	39.57	7.10	31,000
2021-22	200	26.48	5.12	37,500
2022-23	234	23.70	5.60	32,654
2023-24	216	22.84	5.28	32,654

వైఎస్సార్‌సీపీ పాలనలో..

శ్రీశైలానికి వచ్చే వరద జలాలను ఆగస్టు నుంచి నవంబరు వరకు 120 రోజుల వరకు లిఫ్ట్ చేయాల్సి ఉంది. రాయలసీమలోని కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాలకు 40 టీఎంసీల నీటిని తరలించాల్సి ఉంది. మొత్తం 6.025 లక్షల ఎకరాలకు సాగునీటికి, 30 లక్షల మంది జనాభాకు తాగు నీటిని అందించాల్సి ఉంది. 40 టీఎంసీల నీటిలో జిల్లాకు 6 టీఎంసీలు సాగుకు, 1 టీఎంసీ తాగుకు, అనంతపురం జిల్లాకు 11 టీఎంసీలు సాగుకు, 1 టీఎంసీ తాగుకు వాటాలుగా ఇవ్వాలి. జిల్లాలో 80 వేల ఎకరాలకు సాగు, 10 మండలాలకు చెందిన గ్రామాలకు తాగు నీరు అందించాలనేది లక్ష్యం. మొత్తం 114 కి.మీ ప్రయాణించే ప్రధాన కాలువపై కృష్ణగిరి(0.161 టీఎంసీలు), పందికోన రిజర్వాయర్(1.126 టీఎంసీలు) ఉన్నాయి. 2014లో కాలువ షట్టర్లకు కాంక్రీటు వేసి మరీ నీటిని తరలించారు. 2015లో తాగు నీటికి కూడా ఇవ్వలేకపోయారు. తెలుగు దేశం ప్రభుత్వ హయాంలో కేవలం 9.52 టీఎంసీల నీటిని ఇచ్చారు. తూతూమంత్రంగా 42,050 ఎకరాలలో మాత్రమే ఆయకట్టు సాగయ్యింది. 2019- 2024 వరకు వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ పాలనలో 30.56 టీఎంసీల నీటిని రైతులు వినియోగించుకున్నారు. ఐదేళ్లలో మొత్తం 1,64,808ఎకరాల ఆయకట్టు సాగైంది. టీడీపీ హయాంలో కంటే రెట్టింపు ఆయకట్టు సాగైంది. ఏడాదికి రెండు పంటలు పండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



కాల్వలో ప్రవహిస్తున్న కృష్ణా జలాలు



హంద్రీనీవా నీటితో దేవనకొండ పొలాల్లో రబీలో సాగు చేసిన పంటలు

తెలంగాణ మద్యం పట్టివేత



ఆటోలో తరలిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్న పంచలింగాల చెక్‌పోస్టు సిబ్బంది

కర్నూలు: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో తనిఖీల్లో తెలంగాణ మద్యం పట్టుబడింది. కర్నూలు శివారులోని అంతర్‌రాష్ట్ర సరిహద్దు పంచలింగాల చెక్‌పోస్టు వద్ద సెబ్ ఎస్‌ఐ రెహానా బేగం, ఏఎంవీఐ సుబ్బయ్య ఆధ్వర్యంలో శుక్రవారం వాహన తనిఖీలు నిర్వహించారు. అలంపూరు వైపు నుంచి వస్తున్న ఒక ఆటోను ఆపి తనిఖీ చేయగా అందులో 230 తెలంగాణ మద్యం బాటిళ్లు బయటపడ్డాయి. ఆటో తోలుతున్న వ్యక్తి పి.రుద్రవరం గ్రామానికి చెందిన దీపక్ తేజను అదుపులోకి తీసుకుని విచారించగా స్వగ్రామానికి తీసుకువెళ్తున్నట్లు తెలిపారు. దీంతో మద్యంతో పాటు ఆటోను సీజ్ చేసి కర్నూలు సెబ్ స్టేషన్‌ను తరలించారు. అలాగే కర్నూలు సెబ్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో దాడులు నిర్వహించారు. ఉల్చాల గ్రామానికి చెందిన లక్ష్మన్న వద్ద 30, ఓర్వకల్లు మండలం గుట్టపాడు గ్రామానికి చెందిన శ్రీనివాసులు, వడ్డె శివరాముడు దగ్గర 31 మద్యం బాటిళ్లు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. మొత్తం నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సెబ్ సీఐ కేఆర్ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

ఎంసీఎంసీ సెంటర్ పరిశీలన



ఎంసీఎంసీ సెంటర్‌ను పరిశీలిస్తున్న వ్యయ పరిశీలకులు

కర్నూలు(సెంట్రల్): సీపీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) సెంటర్‌ను కర్నూలు పార్లమెంట్ ఎన్నికల వ్యయ పరిశీలకుడు ఆర్‌ఆర్ ఎన్ శుక్లా, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, ఆలూరు అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల వ్యయ పరిశీలకుడు రాకేష్ భదాదియ పరిశీలించారు. శుక్రవారం వారు కలెక్టర్‌ను కలిసిన అనంతరం నేరుగా సెంటర్‌కు వెళ్లి ఎంసీఎంసీ పనితీరును పరిశీలించారు. ఎన్నికల వ్యయాన్ని లెక్కించే విధానంపై ఆరా తీశారు. ఎంసీఎంసీ పనితీరును నోడల్ ఆఫీసర్ రమేష్‌బాబు, డీసీఓ రామాంజనేయులు, మీడియా నోడల్ ఆఫీసర్ వెంకటలక్ష్మమ్మ వారికి వివరించారు.



ఎల్లావత్తుల గ్రామం కన్పించకుండా కమ్మేసిన గాలి



డి.కొట్టాల మెట్ట సమీపంలో రోడ్డుకు అడ్డంగా విరిగి పడిన వృక్షం



వర్షంలో తడవకుండా గొడుగులతో ఇళ్లకు చేరుకుంటున్న దృశ్యం

వాన కురిసింది

రుద్రవరం/ఆత్మకూరు/ సంజామల / కొలిమిగుండ్ల: మండు వేసవిలో వరుణుడు కొంత ఉపశమనం కలిగించాడు. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు భానుడు భగభగ మంటూ భయపెట్టగా.. ఆ తర్వాత ఉరుములు, మెరుపులతో వరుణుడు పలుకరించాడు. రుద్రవరం, ఆత్మకూరు, సున్నిపెంట, కొలిమిగుండ్ల, మహానంది, సంజామల పలు ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం గాలివానతోపాటు మోస్తరు వర్షం కురిసింది. మండల కేంద్రమైన రుద్రవరంతో పాటు అప్పనపల్లె, పెద్దకంబలూరు, డి. కొట్టాల, శ్రీరంగాపురం, యల్లావత్తుల, బీరవోలు తదితర గ్రామాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు గాలివానకు నేలకూలాయి. ఉక్కపోతలో అల్లాడిన ప్రజలు వర్షం కురవడంతో కాస్త ఊపిరి పీల్చుకున్నారు. ఉరుములు, మెరుపుల కారణంగా విద్యుత్ శాఖ అధికారులు ముందు జాగ్రత్తగా ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. సంజామల మండలం ఆకుమల్ల గ్రామంలో ఆరు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. పురాతన వేపచెట్టు వేర్లతో సహా నేలవాలింది. ఆత్మకూరు, ముష్టపల్లి, సిద్ధపల్లి, పెద్ద అనంతపురం గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం ఒక మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. ముష్టపల్లిలో ఓ మోస్తరు వడగండ్లతో కూడిన వర్షం 15 నిమిషాల పాటు పడడంతో గ్రామస్తులు వడగండ్లు తీసుకునేందుకు పోటీ పడ్డారు.

ఎన్నికల వ్యయ అంశాలపై ఫిర్యాదు చేయవచ్చు

● జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీనివాసులు

నంద్యాల: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఎన్నికల వ్యయ సంబంధిత అంశాలపై ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీలు, అభ్యర్థులు ఎవరైనా ఎన్నికల వ్యయ పరిశీలకులకు ఫిర్యాదు చేయవచ్చనని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకులు ఎస్. మణికందన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె, డోన్ అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల వ్యయ పరిశీలకులు కిరణ్ తొట్టుపురం అశోకన్, శ్రీశైలం, నందికొట్కూర్, నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల వ్యయ పరిశీలకులు టికారాం మీనా బుధవారం జిల్లాకు వచ్చారన్నారు. ఎన్నికల వ్యయ సంబంధిత అంశాలపై ఫిర్యాదులు, ఎన్నికల నిర్వహణపై సందేహాలుంటే ఫోన్ చేయదలచిన వారు నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకులు ఎస్. మణికందన్ 82478 16828, 08514- 293910 నంబర్‌కు ఫోన్ చేయవచ్చన్నారు. ఆళ్లగడ్డ, బనగానపల్లె, డోన్ అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల వ్యయ పరిశీలకులు కిరణ్ తొట్టుపురం అశోకన్ 8247807586, 08514 - 293911కు, శ్రీశైలం, నందికొట్కూర్, నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల వ్యయ పరిశీలకులు టికారాం మీనా 6300637529, 08514 - 293912కు ఫోన్ చేసి తమ ఫిర్యాదులను, సలహాలను ఇవ్వవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు.

కృష్ణ జింకపై కుక్కల దాడి

మిడుతూరు: మండల పరిధిలోని చింతలపల్లి గ్రామ శివారుల్లో శుక్రవారం ఓ కృష్ణజింకను కుక్కలు దాడి చేశాయి. గ్రామ శివారుల్లో ఓ కృష్ణజింకను కుక్కలు దాడి చేయడం గమనించిన ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వేల్పుల విజయ్ కుక్కల నుంచి కృష్ణ జింకను కాపాడాడు. అనంతరం ఫారెస్టు అధికారులకు అప్పగించారు. ఫారెస్టు సిబ్బంది గాయపడిన కృష్ణజింకను హాస్పిటల్‌కి తీసుకెళ్లి చికిత్స చేయించారు.



కుక్కల దాడిలో గాయపడిన కృష్ణజింక

మల్లెలు సమర్పించి.. మొక్కులు తీర్చి

● శేషవాహనంపై విహరించిన శ్రీలక్ష్మీరంగ నాథుడు



మల్లెలతో నిండిపోయిన శ్రీలక్ష్మి రంగనాథుడు, శ్రీలక్ష్మి అమ్మవారి మూల విగ్రహాలు

జూపాడుబంగ్లా: తర్తూరు లక్ష్మీరంగనాథుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాల్గొవ రోజు శుక్రవారం శ్రీలక్ష్మీరంగనాథస్వామి వారు శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని శేషవాహనంతో అలంకరించిన ప్రభోత్సవ రథంపై ఉంచి వైభవంగా గ్రామోత్సవాన్ని నిర్వహించారు. శేషవాహనసేవ నాడు శ్రీలక్ష్మీరంగనాథస్వామి వారికి మల్లెలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటే ఏడాదంతా తమకు సర్పగండం ఉండదని భక్తుల నమ్మకం. ఈ మేరకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి వారికి మల్లెపూలలను సమర్పించుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో భక్తులు సమర్పించే మల్లెలతో స్వామి, అమ్మవారి మూలవిగ్రహాలు నిండిపోయాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం హనుమద్వాహనసేవ నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఏడీ వెంకటరమణ, ఆలయ అర్చకుడు ఈశ్వరరెడ్డి తెలిపారు.

బుడ్డాపై క్రిమినల్ కేసులు

సాక్షి, నంద్యాల: శ్రీశైలం నియోజవకర్గ టీడీపీ అభ్యర్థి బుడ్డా రాజశేఖర్ రెడ్డి మీద క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. బెదిరింపులకు పాల్పడడం, దాడులు తదితర నేరాలు చేయడంతో ఆత్మకూరు, వెలుగోడు, నంద్యాల పోలీస్ స్టేషన్ల పరిధిలో ఐపీసీ, సీఆర్‌పీసీ సెక్షన్ల కింద కేసులు ఫైల్ చేశారు. ఐపీసీ 504, 506 సెక్షన్ 155(3), ఐపీసీ 143, 341, 149, 324, 506, 34, సీఆర్‌పీసీ 151 సెక్షన్ల కింద కేసులు నమోదైనట్లు ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. 2019లో బుడ్డా దాఖలు చేసిన ఎన్నికల అఫిడవిట్‌లో ఎలాంటి క్రిమినల్ కేసులు లేవు. ఈ ఐదేళ్ల కాలంలోనే ఆయన మీద పలు పోలీస్ స్టేషన్లలో క్రిమినల్ కేసులు నమోదవడం గమనార్హం.

పెరిగిన బుడ్డా దంపతుల ఆస్తులు

ఆత్మకూరు: శ్రీశైలం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థులుగా నామినేషన్లు వేసిన బుడ్డా దంపతుల ఆస్తుల విలువ గత ఎన్నికల కంటే ఇప్పుడు ఎక్కువగా ఉన్నట్లు వారు సమర్పించిన అఫిడవిట్‌లో ఉంది. గత ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసిన బుడ్డా రాజశేఖర్‌రెడ్డి చరాస్తులు పరిశీలిస్తే రూ.47,35,533 ఉండగా, బుడ్డా శైలజకు అప్పట్లో రూ.22,71,420 ఆస్తులు ఉండేవి. ప్రస్తుతం ఇప్పుడు ప్రకటించిన ఆస్తులు వివరాలు పరిశీలిస్తే చరాస్తుల్లో బుడ్డాకు రూ.39,09,644, బుడ్డా శైలజకు వాహనాలు, బంగారం కలిసి రూ.96,32,854 చరాస్తుల విలువ పెరిగాయి. అలాగే స్థిరాస్తులు పరిశీలిస్తే బుడ్డా రాజశేఖర్‌రెడ్డికి భూములు, భవనాలు, సొంత ఇళ్లు కలిపి గత ఎన్నికల సమయంలో రూ.64,39,000, బుడ్డా శైలజకు రూ.22,50,000 స్థిరాస్తులు ఉన్నాయి. ప్రస్తుతం సమర్పించిన అఫిడవిట్‌లో బుడ్డా రాజశేఖర్‌రెడ్డికి రూ.58,99,200, బుడ్డా శైలజకు రూ.1,61,51,000 స్థిరాస్తి కలిగి ఉంది. ఇలా ఆస్తుల వివరాలు చూస్తే గతం కంటే బుడ్డా రాజశేఖర్‌రెడ్డికి రూ.49,76,848 పెరగగా బుడ్డా శైలజకు రూ.2,12,62,434 ఆస్తి పెరిగింది. అయితే ఈ దంపతులకు రూ.88,49,999 అప్పులు ఉన్నట్లు చెప్పారు.

క్షేత్ర రక్షణకు కుంభోత్సవం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో నిర్వహించే కుంభోత్సవం క్షేత్ర రక్షణ కోసమేనని, అమ్మవారికి ఉత్సవ సంబంధిత కైంకర్యాలన్ని పరిపూర్ణంగా జరిపించాలని శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు వైదిక కమిటీని ఆదేశించారు. ఈ నెల 26న శ్రీశైలంలో నిర్వహించే కుంభోత్సవం సందర్భంగా ఏర్పాట్లపై శుక్రవారం సాయంత్రం వివిధ శాఖల అధికారులతో ఈఓ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ దేవదాయ చట్టం అనుసరించి క్షేత్ర పరిధిలో జంతు, పక్షి బలులు, జీవహింస పూర్తిగా నిషేధిచడం జరిగిందన్నారు. నిషేధం అమలుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ విషయమై రెవెన్యూ, పోలీసు శాఖల పూర్తి సహాయ సహకారాలను అందించాలని ఆ శాఖల స్థానిక అధికారులకు సూచించారు. జంతుబలి నిషేధానికి పోలీసు, రెవెన్యూ సిబ్బంది చేత తనిఖీ బృందాలను ఏర్పాటు చేయాలని అన్నారు. అదేవిధంగా ప్రత్యేకంగా గస్తీని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కుంభోత్సవం రోజు అమ్మవారి దర్శనానికి క్యూలైన్లలో తొక్కిసలాట లేకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఈఓ పెద్దిరాజు

సమావేశంలో శ్రీశైలం మండల తహసీల్దర్ గుర్రప్ప, సీఐ ప్రసాదరావు, ఎస్ఐ లక్ష్మణరావు, మాణికేశ్వరిమాత ఆశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

హాల్‌టికెట్లను వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): డ్రాయింగ్, హ్యాండ్లూమ్, వీవీంగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీలో టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సుల పరీక్షలకు హాల్‌టికెట్లను వెబ్‌సైట్లను www.bsc.ap.gov.inలో డౌన్‌లోడ్ చేసుకోవాలని డీఈఓ సుధాకర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 22వ తేదీన నుండి 25వ తేదీ వరకు స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హాజరు కావాలన్నారు. ప్రభుత్వం జారీ చేసిన కనీసం ఒరిజినల్ చెల్లుబాటు అయ్యే ఫొటో గుర్తింపు కార్డు, పాన్‌కార్డు, ఓటరు ఐడీ, ఆధార్‌కార్డు ఏదో ఒకటి తీసుకొని రావాలన్నారు. టెక్నిక్ ట్రైనింగ్ సర్టిఫికెట్ ఉన్న వారికే అర్హత ఉంటుందన్నారు.